
# సినీ బేతాళ కథలు





– డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 39 -

### - మంబో జంబో -

**విక్రమార్కుడు** బేతాళుడి శవాన్ని, ఫ్లైలయిపోయిన సినిమా బాక్సుని డిస్ట్రిబ్యూటర్ ఆఫీసుకి మోసుకు పోతున్నట్టు తన భుజం మీద మోసుకుంటూ మళ్లీ నడకసాగించాడు.

'విక్రా! మార్గమధ్యంలో నీకు శ్రమ అనిపించకుండా వుండేందుకు మరో కథ చెబుతాను, విను!'- అని బేతాళుడు ప్రారంభించాడు.

"విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీలో జంబూభాయ్ అనే లెఖ్ఖల ప్రొఫెసర్‌గారు స్టూడెంట్స్‌కి లెఖ్ఖలు బోధించేవారు. ఆయన పూర్తిపేరు జంబులింగం. అందరితో కలివిడిగా వుండి జంబూభాయ్ అయిపోయారు. జంబూభాయ్‌కి తెలుగు సినిమాలంటే క్రేజు. వందరోజుల సినిమా వందసార్లు చూస్తాడు. తొందరగా యింటర్వెల్‌దాకా ఆడే సినిమా ముందురోజు చూసి మానేస్తాడు. సినిమా రిలీజవగానే ఆ సినిమా ఎన్నిరోజులు ఆడుతుందో, యెంత కలెక్ట్ చేస్తుందో, అందులో నటించిన నటీనటులకు తర్వాత వేషాలు వస్తాయో రావో అన్నీ కచ్చితంగా ముందే లెక్కలు కట్టి, ఆ లెక్కలన్నీ రోజూ తన స్టూడెంట్స్‌కి చెబితేగానీ అసలు లెఖ్ఖల పాఠం ప్రారంభించడు.

క్రమంగా జంబూభాయ్ క్రేజు యింక్రీజై తను కూడా సినిమానటుడై తారాపథంలో చక్కటి చుక్కడిలా వెలగాలనిపించింది. అంతే - వెంటనే తన లెఖ్ఖల ప్రొఫెసర్ జాబ్ రిజైన్ చేసి, ఆదరాబాదరగా హైదరాబాదు చేరాడు.

ప్రొడక్షన్ ఆఫీసుల చుట్టూ తిరిగాడు. అనేక నిర్మాతల్ని కలిశాడు. ఒక నిర్మాత - 'నీ మొఖానికి వేషం యెవడిస్తాడు?' అన్నాడు. మరో నిర్మాత 'ఆర్టిస్టులు జనాభాలా పెరిగిపోతున్నారు. వున్నోళ్లతోటే యేగలేక చత్తన్నాం. నీకు సాన్సులు యమా కట్టం' అన్నాడు. యింకో శాల్తీ, 'నువ్ తెలుగు బాసని యిరగదీసేత్తన్నావ్. వొత్తులు బాగా పలుకుతున్నావ్ - నువ్వసలు ఫిట్టవ్వు' - అన్నాడు. అయినా జంబూభాయ్ నిరాశపడలేదు. అలాగే గ్రహణం పట్టిన ఆర్టిస్టు గ్రహంలా తిరుగుతూ తిరుగుతూ వొకరోజు అంబుజవల్లిని కలిశాడు. అంబుజవల్లి అందమైన హీరోయినే కాకుండా అడపాదడపా నిర్మాతగా చిత్రాలు నిర్మిస్తుంది. ఆమె జంబూభాయ్‌తో - 'సూడు, పొగెసరూ! నాకు లెక్కలు రావు. అది నా యీక్‌నెస్సు. అంచాత నా పొడక్సనుగాల్లు నన్ను కిందా మీదా పెట్టి లెక్కలు తారుమారు జేసి బొక్కలు సూపిత్తన్నారు. సినేమాలో సేసి సేసి, తీసి తీసి నా బొక్క బక్కెటంతయి కూసుంది. నువ్ నాగ్గాని లెక్కలు సూసిపెడితే

బొక్కలోంచి బైటపడి కనీసం రందరంతో వుండిపోతా. నీకు సినిమా జిలగాబట్టి యేసం ఫిక్సప్పు సేయిస్తా. యావంటావ్?' అంది. వెంటనే జంబూభాయ్‌కి కళ్లల్లో కృతజ్ఞతా బాష్పాలు తిరిగాయి. 'అమ్మా మీరు అంబుజవల్లి కాదు. నా పాలిట అంబవి. వరాల శాంభవి. మిమ్మల్ని నష్టాల్లోంచి గట్టెక్కించి నా కష్టంలోంచి బైటపడతా. నాలో నటుడిని వెలికి తీయండి. నేను ఏవిటో మన ప్రేక్షకులకు చూపిస్తా.' అని ఆమె కాళ్ల మీద పడబోయి కంగారులో ఆమె కాళ్లు తనమీద పడేసుకున్నాడు.

'పొగెసరూ, నీ యపెక్స్‌కి నేనడిపోయా - కమాన్!' అని అంబుజవల్లి, జంబూభాయ్‌ని వాటేసుకుంది. వాటేసుకుని - 'యిదిగో సెంబూ - నువ్వేటో పేచ్చకులకి కెమేరావోడు సూపిత్తాడు. యిప్పుడున్న యావరేజోల్ల ముకాలకంటే నీ ముకమే నికరం. నడు, ముందు నీకో వేక్టింగు లెస్సనిత్తా - ద్దా, ద్దా, ద్ద!' అని రిజైన్డ్ లెఖ్ఖల ప్రొఫెసరూ, రేపటి నటుడూ అయిన జంబూ భాయ్‌ని గేదెని ప్రేమగా తోలుకెళ్లినట్టు తన బెడ్ రూమ్‌లోకి తోలుకెళ్లింది.

షూటింగ్ మొదలైంది. జంబూభాయ్‌కి ఒక చిన్న లాయరు వేషం యిచ్చారు. మేకప్ చేసి, డ్రెస్ వేసి వెయిట్ చైమన్నారు. స్టూడియోలో షాట్‌కోసం వెయిట్ చేస్తూ, ఫ్లోర్ బైట కుర్చీలో జంబూభాయ్ వొక్కడూ ఒక చెట్టుకింద కేసుల్లేని చెట్టుకింద లాయర్లా కూర్చున్నాడు. ఇంకొంతమంది నటీనటులు అక్కడా యిక్కడా కూర్చుని షాట్ కోసం వెయిట్ చేస్తూ సినిమా నీతులు బూతుల్లో మాట్లాడుకుంటున్నారు.

కొద్దిసేపట్లో సడెన్‌గా వాతావరణం సైలెంటయిపోయింది. చూస్తే అప్పుడే షాట్ పూర్తిచేసుకుని హీరో జింబోరాయ్ ఫ్లోర్‌లోంచి బైటికొచ్చాడు. ఒక అసిస్టెంట్ డైరెక్టర్ చైర్ తీసుకొచ్చివేశాడు. మరొక శాల్తీ, ఎండా వానా లేకపోయినా ఒక గొడుగు విప్పి హీరోకి పట్టాడు. జింబోరాయ్ విష్ణుమూర్తి వేషంలో వున్నాడు. అంచేత గొడుగుపట్టిన శాల్తీ ఆదిశేషువులా అనిపిస్తున్నాడు. మరో మూడో శాల్తీ వొక పళ్లెంలో తమలపాకులు, సున్నం, జరదా, సిగరెట్లు పట్టుకుని ముష్టి అడుక్కోడానికి ఆరాట పడుతున్నట్టు పరుగు నడకతో హీరో జింబోరాయ్ దగ్గరకు వచ్చాడు.

జింబో 'ఊఁ!' అని వురిమాడు. ముష్టి కుర్రాడు వణికిపోతూ గబగబా తమలపాకులకి సున్నం రాసి, జరదా పూసి జింబోకిచ్చాడు. హీరో జరదా పాన్ నోట్లో కూరుకుని నెమరేస్తున్నట్టు నవులుతూ మళ్లా 'ఊఁ!' అన్నాడు. ఆ కుర్రాడు వెంటనే సిగరెట్ జింబోరాయ్ నోటికందించి లైటర్‌తో వెలిగించి పెట్టాడు. అలా వెలిగించేటప్పుడు ఆ కుర్రాడి ముఖంలో 'కాన్సరొచ్చిపోతావు నా కొడకా!' అనే భావప్రకటన కనబడింది లాయర్ వేషంలో వున్న నూతన నటుడు జంబూభాయ్‌కి. సర్లే మనకెందుకులే అనుకుని, కథలో లాయర్ పాత్రకీ, విష్ణుమూర్తి పాత్రకీ పొంతన ఏవిటా అని తెగని ఆలోచనలో పడ్డాడు జంబు. లెఖ్ఖల ప్రొఫెసర్‌కి లెక్క తేల్లేదు. బహుశా ఈ కథకి తలా మొలా వుండి వుండవు. యెన్నో సినిమా కథల్లాగ. ఏదో డ్రీమ్ సీక్వెన్స్ అయివుంటుంది - అని సరిపెట్టుకున్నాడు. ఇంతలో 'ఏయ్' అనే పశువుల్ని తోలే అరుపు వినిపించింది. మళ్లీ అదే గొంతుతో 'నిన్నేరా! పిలిసేది' అని రెండో అరుపు. చూస్తే హీరో జింబోరాయ్ - తననే పిలుస్తున్నాడు. జంబూభాయ్ లేచి జింబోరాయ్ దగ్గరకు వెళ్లాడు. 'పిలిచారా సార్?' అనడిగాడు. 'అవున్రా పిలిసాను. కొత్తా? ఆ కుర్చీ లాక్కుని యిలా కూకో. కొత్తోళ్లని తక్కూ సేసి సూసే యాబిట్టు నాకులేదు. నానెప్పుడూ యెంకరేంజింగే.'

జంబూభాయ్ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. జింబోరాయ్ అడిగాడు - 'ఏ వూర్రా మనది?'

'విశాఖపట్నం సార్' - జంబో.

'యిసాకపట్టం, సవుద్రం పక్కనుంటది. నాకు తెలుసు - ఏం సేసేవాడివక్కడ?' - జింబో

'లెఖ్ఖల ప్రొఫెసర్నండి - ఆంధ్రాయూనివర్సిటీలో'

'ఆంధరాయోనివరసిటీనా?'

'యోనివర్సిటీ కాదండి - యూనివర్సిటీ -'

'ఏటీ - ఆ మాత్తరం నాకు తెల్దా?'

'అదికాదు సార్ - అలా అంటే బూతండి.'

'బూతయితే ఏటీ? బూతం కాదుగా. అయినా ఆరిటిస్టన్నోడికి బూతదయతోపాటు బూతుదయకూడా వుండాల. అసలు మనం వరకు సేసేదే బూతు సినేమా సెపంచకంలో. బూతులు గురింసి నాకు నీతులు సెప్పక యెదవా!'

'సార్ - మీరేవనుకోకపోతే చిన్న సందేహం.'

' సందేవవా - యిన్నించుకోరా!'

'హీరోగా మీరంటే నాకెంతో అభిమానం.'

'సెబాసో'

'నేను ఒక గొప్ప యూనివర్సిటీలో మేథ్స్ ప్రొఫెసర్‌గా పనిచేశా - చూడగానే నన్ను ఏరా, యెదవా అని పిలవడం న్యాయమా చెప్పండి.'

'ఏట్రా, లాయర్ గెటప్‌లో దిగ్గానే నాయం, అన్యాయం అంటూ పాత్తరలో లీనమయిపొయ్యావా అప్పుడే సూడు. ఇది సినేమా లోకం - యిక్కడికి అంతా వత్తారు. డాకటర్లు, డాకటరేటులు, లాయరోల్లు, వింజినీరులు, సెప్పులు కుట్టేవోళ్లు, కప్పులు కడిగేటోళ్లు, వారసులు, బేవారసులు యింకా పనికిమాలినోల్లు, పయిత్తరం పాపలు, పరమకెమసిచ్చనున్నోల్లు - యిలా రకరకాలు, యీరొంపిలోకి రాడానికి పైకి రాడానికి అరగతలూ, అంతరాలు అక్కర్లా. లక్కు. లక్కుండాల. కసింత వేకిటింగ్ రావాల - ఆపైన పనీపాటాలేని అబిమానుల గొర్రెల మందలుండాల. అంచాత - నేసెప్పేదిను. ఏరాలు, ఒరేలు పట్టించుకోమాక. ఓ పీలయిపోక' అన్నాడు హీరో జింబోరాయ్.

'మీరు చెప్పింది సత్యమే అనిపిస్తోంది.' అన్నాడు జంబూభాయ్.

యింకా నెక్స్ట్ షాట్ రెడీ కాలేదు.

హీరో జింబో మళ్లీ మాట్లాడాడు -'వురే - నీ పేరేటన్నావ్?'

'జంబూభాయ్'-

'ఆఁ - జంబు - యిదిగో జంబూ! యిందాకన్నుంచి నాకోడౌటు తినేత్తాంది. నువ్వచ్చం నాలాగే వున్నావ్! అంటే - నాను అద్దంలో సూసుకున్నట్టు. నేను డూయల్‌రోల్ సేత్తే - టిరిక్కులూ, గిమిక్కులూ దండగ. నిన్నెట్టేసి బొమ్మలాగెయొచ్చు. ఓమాటడుగుతా సెప్తావేంటి? -'

'ఏవిటి సార్?' అడండి అన్నాడు జంబూ.

'ఏంరా - మీ అమ్మగాని ఎప్పుడేనా మాయింటో వంటమడిసిగా పన్జేసిందా? - హ్హాహ్హాహ్హా! వూరికే. మన మేచింగ్ పేసుల కలారిటి కోసవడిగా - హ్హా!హ్హా!హ్హా!' అని నవ్వుతూ అడిగిన జింబోరాయ్, ప్రొఫెసర్ జంబూభాయ్‌కి - హీరోకి బదులు విలన్‌లా కనిపించాడు. విష్ణుమూర్తి గెటప్ జింబోకి నప్పలేదనిపించింది - ఆ గెటప్‌లో హీరో ఏదో రాక్షసుడి వేషం వేసినట్టుంది -

- అదీ విక్రమార్కా - సంగతి. నా యీ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం యివ్వకపోయావో నీ తల ప్రొఫెసర్ జంబూ భాయ్ కూడా లెక్కపెట్టలేనన్ని ముక్కలుగా పగిలిపోతుంది -" - అని ముగించాడు బేతాళుడు.

బదులుగా విక్రమార్కుడు - "ఓ! బేతాళా! హీరో జింబోరాయ్, జంబూభాయ్‌ని, 'మీ అమ్మ ఎప్పుడేనా మా యింట్లో వంటమనిషిగా పనిచేసిందా?' అని అడిగినదానికి బదులుగా జంబూ భాయ్ 'అబ్బే లేదండి - కానీ మా నాన్న మాత్రం మీ అమ్మగారి

కారు డ్రైవరుగా పనిచేశాడు - అందుకే మనిద్దరం వొకేపోలికలో వున్నాం` అని రెప్లై కొట్టాడు. ఆ రెప్లై హీరో జింబోరాయ్ బుర్రకెక్కి, పిచ్చెక్కినవాడై, స్టూడియో అంతా మార్మోగేలా అరుపులు మొదలెట్టాడు. ఆ అరుపులు తగ్గేలోగానే ప్రొఫెసర్ జంబూభాయ్ విశాఖపట్నం ఫ్లైటెక్కేసాడు.

దృష్ట్వేదం మానుషం రూపం
తవసౌమ్యం జనార్దన!
ఇదా నీ మస్మి సంవృత్తః
సచేతాః ప్రకృతింగతః!!

- ఓ కృష్ణా! మనుష్యాకారంతో వున్న నీ సౌమ్యరూపం చూసి యిప్పుడు మనస్సు తేలికపడి పూర్వపు స్వస్థత పొందాను. - అనుకున్నాడు ఫ్లైట్ విండోలోంచి దేవుణ్ని చూసిన లెఖ్ఖల ప్రొఫెసర్ జంబూభాయ్ -" అని సమాధానం చెప్పగానే, రాజుకి మౌనభంగం కలిగి, బేతాళుడు యెగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments